# రచనానైపుణి

శ్రీమతి సూర్యదేవర సులోచనాదేవి

చదవటం వేరు, వ్రాయటంవేరు. వ్రాయగలిగే వారంతా చదవగలరు, కాని చదవగలిగే వారంతా వ్రాయలేరు. రచనానైపుణ్యం సాధన మూలంగా అలవడే ఒక ఉత్తమశిల్పం. చాలామంది సోదరీమణులు రోజంతా చదవగలరు, కాని ఒక్క పదిహేను నిమిషాలు కూర్చొని వ్రాయలేరు. ఇందుకు కారణం వారిలో కల్పన లేక కాదు, కల్పనకు తగిన పదాలు దొరకక కాదు, కేవలం తాము వ్రాయగలం అనే ఆత్మవిశ్వాసమూ, ఆలోచనలకు ఒక సక్రమ రూపం ఇచ్చే అభ్యాసమూ లేక మాత్రమే.

"గృహలక్ష్మి" వచ్చి మన ఆంధ్రసోదరీమణుల్లో చాలామందిలో ఇదివరకు ఇమిడి వున్న యీ వ్రాయలేనితనాన్ని చాలవరకు నశింపు చేసింది; ఇప్పుడు చేస్తూవుంది; ఇక ముందు చేస్తుంది కూడాను. తోటి తెలుగు సోదరీమణుల రచనలను చూచి, ప్రోత్సాహితలై, అనేకమంది వనితలు సుందరమైన రచనలు వ్రాయటం ప్రారంభించారు. బాగా చదవకలిగిన వారంతా బాగా వ్రాయగలవారుగా మారాలనే మనందరి అభిలాష.

రచనా పటిమకు ప్రధానం విషయజ్ఞానం. ఒక విషయాన్ని గురించి బాగా తెలియందే ఆ విషయాన్ని గురించి వ్రాయటం అసంభవం. విషయజ్ఞానం సంపాదించాలంటే అనేక విషయాలను గురించివున్న పుస్తకాలనూ, పత్రికలనూ చదవటం అవసరం. చదవటమంటే నవలను చదివినట్లు పుటలు వడివడిగా త్రిప్పి వేయటంకాదు. నిదానంగా, కంటితోకాక, మనసుతో చదువుతూ విశేషాలను పుస్తకంలో నోటు చేసుకోవాలి.

విషయజ్ఞానం ఎప్పుడైతే ఏర్పడుతుందో, ఆవిషయానికి తగిన పదాలు వాటంతటవే దొర్లుతవి అభ్యాసంవల్ల. తమ రచనలు పెద్దవిగా నుండాలని అభిలాషపడి చాలామంది సోదరీమణులు రచనలోని గాంభీర్యాన్నీ లాలిత్యాన్నీ, పోగొట్టుకుని మొదలిడతారు. కావలసింది సారంకాని సంఖ్యకాదు. ఎక్కువ విషయాన్ని కొద్దిమాటలద్వారా వ్యక్తపరిచే మార్గాన్ని అలవరచుకోవాలి. రచనలు చిన్నవిగానూ, గాంభీర్యంగానూ, సుందరంగానూవుంటే, వ్రాసేవారికి శ్రమగానూ వుండదు, పత్రికలవారికి కాగితం ఖర్చూ ఎక్కువ వుండదు, అటు చదివే వారికికూడ అధిక ప్రయాస వుండదు.

ప్రతి రచయిత్రీ తాను వ్రాయబోయే విషయాన్ని ముందుగ మనసులోనే బాహ్యరేఖల్లో దిద్ది తీర్చి వుంచుకుంటే, కాగితమూ కలమూ తీసుకొని ఆలోచిస్తూ వృధాగా కాలవ్యాపన చేయాలసిన అవసరం వుండదు. వ్రాయబోయే ప్రతిరచననూ

స్థూలంగా మూడు భాగాలుగా విభజించుకోవాలి: ఆది, మధ్య, అంతం. ఎప్పుడూకూడా ఆది, అంతం యీరెండూ చాలా ఆకర్షణీయంగా వుండేలాగా ప్రయత్నించాలి. ఎలాంటె, రచన ఆదిలో బాగుండకపోతే, చదివేవారు ఇక లోపలకు చదవకుండా దాన్ని అంతటితో మూసేస్తారు. ఇక రచన అంతంలో కనుక మనోహరంగా లేనిచో, చదివి ముగించిన వారిమనస్సు పై విశేష ప్రభావం ఏమీపడదు. ముగింపులో చదివిన ఆఖరు వాక్యాలే పాఠకుల హృదయాల్లో నిలచిపోయేవి. కనుక రచనలోని ముగింపు చాలమనోహరంగా వుండాలి.

రచనలో ఒక విషయాన్ని గురించి చెప్పేటప్పుడు అతిగా వర్ణించటం బాగుండదు; అదే విధంగా అసలు వర్ణించక పోవటంకూడా బాగుండదు. వర్ణన తగుమాత్రంగా మాత్రమే వుంటే బాగుంటుంది. రచన సాగించే ప్రాథమికులు ప్రధానంగా గుర్తించుకో వలసిన విషయమేమంటే పెద్ద పెద్ద వాక్యాలకోరకూ, గొప్ప గొప్ప పదాలకోరకూ వెదకరాదనేది. తాను వ్యక్తపరచ దలచిందేమిటో, దాన్ని చిన్న వాక్యాల్లోనూ, మామూలు పదాల్లోనూ చెప్పివేయటం అలవరచుకోవాలి. అంటే పెద్దవాక్యాలూ, గొప్పపదాలూ వాడకూడదని తాత్పర్యంకాదు. రచయిత్రి క్రమేణ తన రచనా శిల్పంలో ఉన్నతి పొందిన కొలదీ తన శైలిని ఉచ్చస్థాయికి తెచ్చుకోవచ్చు. కాని, ప్రథమంలోనే పెద్ద పెద్ద వాక్యాలకోరకూ, గొప్ప గొప్ప పదాలకోరకూ చూస్తే, అలాంటి ప్రయత్నంలో రచయిత్రియొక్క కలంలోని సిరా ఎండిపోవటం మాత్రమేకాక మనసులోని కల్పనాధారకూడా ఎండిపోతుంది.

రచయిత్రి ప్రతివిషయంపైనా తన కలాన్ని నడపాలని ప్రయత్నిస్తే, దాని ఫలితాలు సఫలంగా వుండవు. తనకు చొరవ అభిమానం వున్న విషయాలను గురించి బాగా పరిజ్ఞానం సంపాదించి ఆవిషయాలను గురించి ఆహ్లాదకరంగా వుండే రచనలను సాగిస్తే రక్తికడుతుంది. అంతేగాని, తనకు పరిచయంలేని విషయాలనుకూడా తెలిసినట్లునటిస్తూ వ్రాస్తే, ఆరచనలు చదివేవారికర్థం కాకపోగా, ఆవ్రాసిన రచయిత్రులకు అంతకంటె అర్థంకాకుండా పోతుంది. నేటి తెలుగు సోదరీమణుల రచనలు చాలా మనోహరంగా వుంటున్నవి. ఇంకాముందు ఇంతకంటె మనోహరంగా వుండగలవని ఆశ.